


విషజ్వరాలతో విలవిల

జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, , ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 285 డెంగ్యూ కేసులు నమోదైనట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వీరి గణాంకాల్లో చేరనివి ఇంతకు పదింతలుంటాయని అంచనా.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి పిల్లల వార్డులో జ్వరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

● రోగులతో ఆస్పత్రులు కిటకిట ● ఇప్పటికే 285 డెంగ్యూ కేసుల నమోదు

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి సాధారణంగా రోజుకు 1500మంది ఓపీకి వస్తుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 3వేలకు చేరుతోంది.వీరిలో జ్వరంతో వచ్చే వారి సంఖ్య సగానికి పైగానే వుంటోంది. ఉదయం 9 గంటల నుంచే ఓపీ విభాగం కిక్కిరిసిపోతోంది.జనరల్ మెడిసిన్ విభాగం జ్వర బాధితులతో నిండిపోతోంది.ఇక్కడ డెంగ్యూ నిర్ధారణకు నిర్వహించే ఎలిసా టెస్టు ఫలితాలకు మూడు రోజులు పడుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు వస్తే పరీక్షలు చేయడం లేదు.10 మంది వుంటేనే ఎలిసా పరీక్షలు చేస్తుండడంతో రూ.వెయ్యికి పైగా చెల్లించి చాలామంది ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలు చేయించుకుంటున్నారు.నిజానికి ఈ ర్యాపిడ్ టెస్ట్‌లో ఖచ్చితత్వం ఉండడం లేదన్న కారణంతో మూడేళ్ల క్రితం ఆ పరీక్ష చేయవద్దని వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ ప్రైవేటు ల్యాబుల్లో ఈ పరీక్షలకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు.



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వద్ద రద్దీ

● ఆస్పత్రుల్లో ఖర్చు తడిసి మోపెడు

డెంగ్యూ జ్వరానికి సకాలంలో వైద్యం చేయించుకుంటే ప్రమాదం వుండదు. ఇది సోకితే రోగి శరీరంలో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గడం సహజం. మరీ తగ్గితే తప్ప ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు.అయితే దీనిపై అవగాహన లేక ఎంతోమంది భయంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. అక్కడ రక్తపరీక్షలు, బెడ్ ఛార్జీలు, మందులు అంతా కలిపి రూ.20 నుంచి 30 వేలు ఖర్చవుతుండడంతో పేదలతో పాటు మధ్యతరగతి ప్రజలు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో నమోదైన డెంగ్యూ, మలేరియా కేసులు

సంవత్సరం	డెంగ్యూ	మలేరియా
2019	327	8
2020	25	3
2021	213	4
2022	179	2
2023	235	2
2024నవంబరు 19వరకు	285	2

మందులన్నీ అందుబాటులో వుంచాం




వర్షాకాలం తర్వాత వాతావరణ మార్పులు సర్వసాధారణం.కాలువల్లో, తొట్టెల్లో, గుంతల్లో నీటి నిల్వతో దోమలు చేరి వ్యాధులకు కారణమవుతున్నాయి.ఈ కారణంగానే వైరల్ ఫీవర్లు వస్తుంటాయి. ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వేలు నిర్వహించి, జ్వరపీడితులను విలేజ్ హెల్త్ క్లీనిక్కులకు తీసుకెళ్లి డెంగ్యూ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తాం.విషజ్వరమని నిర్ధారణ అయితే పీహెచ్‌సీకి రెఫర్ చేసి సీబీసీ చేయించి దానికి తగ్గట్టుగా వైద్యం అందిస్తున్నాం. అందుకు అసరమైన వైద్యులు, మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు కూడా జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి.

- డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

పంచాయతీలకు మరింత ఊరట

15వ ఆర్థికసంఘం నిధులు రూ.30.32 కోట్ల విడుదల



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాసుల లేమి నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న గ్రామపంచాయతీలకు మరింత ఉపశమనం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో జిల్లాపరిధిలోని గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలివిడత 15వ ఆర్థిక సంఘ నిధులను కేంద్రం విడుదల చేసింది. మొత్తం 697 పంచాయతీలుండగా ఎన్నికలు జరగని 13 పంచాయతీలు మినహా 684 పంచాయతీలకు రూ.30,32,73,720 మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రానికి ఆదేశాలందాయి.ఆ నిధుల్లో టైడ్ గ్రాంట్ కింద రూ.18,19,64,239, అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.12,13,09,481 వెరసి మొత్తంగా రూ.30.32 కోట్లు విడుదలయ్యాయి.

● నేరుగా పంచాయతీల ఖాతాలకే

జిల్లావ్యాప్తంగా 60శాతం గ్రామపంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, ఇప్పుడిప్పుడే వాటికి ఉపశమనం లభిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయంలో టీడీపీతోపాటు వైసీపీకి చెందిన సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ ఖర్చు చేసి, బిల్లులు విడుదలకాక లబోదిబోమనేవారు. నాడు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 14, 15 ఆర్థిక సంఘాల నిధులను విద్యుత్ బకాయిల పేరిట 80శాతం మినహాయించుకోవడం ఇక్కట్లను జటిలం చేశాయి. గత ప్రభుత్వ తీరును నిరసిస్తూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు సర్పంచులు ఎన్నో పోరాటాలు చేసినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వారిద్దరి చొరవ కారణంగా పాత బకాయిలు రెండు దఫాలుగా కేంద్రం నుంచి విడుదలయ్యాయి. ప్రస్తుతం విడుదలచేసిన నిధులను కేంద్ర ప్రభుత్వమే నేరుగా పంచాయతీల ఖాతాలకే కేటాయించనుంది. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీలకు ఎంత మొత్తం వచ్చిందనే సమాచారం పంపే ఏర్పాట్లలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. సంబంధిత ప్రక్రియను డీపీవో పార్వతి పర్యవేక్షిస్తున్నారు.

మరో నాలుగేళ్లపాటు పోషకాల బియ్యం పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతా చట్టంలో భాగంగా పేదలకు అందిస్తున్న పోషకాలు కల్గిన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీని మరో నాలుగేళ్ల పొడిగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. కోవిడ్ విపత్కర పరిస్థితుల సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకంలో భాగంగా ప్రతినెలా కార్డులోని ఓ వ్యక్తికి ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. తొలుత ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీతో ఈ పథకం గడువు ముగియనుంది. ఈ గడువును 2028 డిసెంబరు 31వ తేదీవరకు పొడిగిస్తూ తాజాగా నిర్ణయం తీసుకోవడంతో పేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి డివిజన్ల పరిధిలోని 5,43,202 రేషన్ కార్డులు ఉన్నాయి. పీఎంజీకేఏవైలో భాగంగా జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో ఉన్న 4,97,247 కార్డులకు కేంద్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంది. మిగిలిన 45,955 కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ భరిస్తోంది. ప్రస్తుతం కోవిడ్ తగ్గుముఖం పట్టినా, అధిక వర్షాలు, వరదలు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత బియ్యం పంపిణీ కొనసాగించేందుకు సంయుక్తంగా నిర్ణయించాయని డీఎస్వో శంకరన్ తెలిపారు.

ఆ గొలుసు దొంగలు చిత్తూరువాసులే..!

● నాటకీయ పరిస్థితుల్లో పట్టుబడ్డ మహిళలు

చిత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె పోలీసులు ఇద్దరు మహిళల్ని దొంగతనం కేసులో అరెస్టు చేసి మంగళవారం రిమాండుకు పంపించారు. ఆ ఇద్దరు మహిళలు చిత్తూరు నగరంలోని ఓబనపల్లె వాసులే. సోమవారం జరిగిన ఈ దొంగతనం నాటకీయంగా ఉంది. నెల్లూరు జిల్లా బిట్రగుంటకు చెందిన కొంతమంది దశాబ్దాల కిందట చిత్తూరు నగరంలోని ఓబనపల్లెలో స్థిరపడ్డారు. వారి వృత్తి దొంగతనమే. పురుషులు బయటి ప్రాంతాల్లో దొంగతనాలకు వెళ్తారు. మహిళలు స్థానికంగానే ముందస్తు రెక్కీ వేసి చోరీలు చేస్తుంటారు. ఓబనపల్లెలో స్థిరపడిన 'ఆ కొన్ని కుటుంబాలు' నేటికీ దొంగతనాన్నే వృత్తిగా చేసుకుని బతుకుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పుంగనూరు నుంచి చౌడేపల్లె మీదుగా తిరుపతి బయల్దేరిన ఆర్టీసీ బస్సులో ఆ ఇద్దరు మహిళలు సరోజ, జ్యోతి పుంగనూరులో ఎక్కారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటు రిటైర్డ్ ఉద్యోగి సరస్వతమ్మ పక్కన కూర్చొని కాస్త అనుమానకరంగా, దురుసుగా ప్రవర్తించారు. చౌడేపల్లె సర్కిల్లో బస్సు ఆగితే దిగిపోయారు. బస్సు మళ్లీ కదిలి 50 మీటర్ల దూరం ప్రయాణించగా.. సరస్వతమ్మ బ్యాగులో 22 గ్రాముల బంగారు గొలుసు, రూ.4 వేల నగదు లేదని గుర్తించారు. వెంటనే బస్సును ఆపేశారు. చౌడేపల్లెలో పలమనేరుకు బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్న మరో ఆర్టీసీ బస్సులోనూ చూశారు. ఆ ఇద్దరు మహిళలు కనిపించలేదు. ఆ బస్సు కంటే ముందున్న ఆటో ఎక్కి వెళ్లిపోయారు. చౌడేపల్లెకు, పలమనేరుకు మధ్యలోని రాయల్‌పేట వద్ద ఆటో దిగేసి, వెనుకే వచ్చిన ఆర్టీసీ బస్సు ఎక్కారు.

బాధ్యతగా వ్యవహరించిన బస్సు డ్రైవర్

తన కళ్ల ముందే చౌడేపల్లెలో హడావిడిగా ఆటో ఎక్కడం, తన బస్సును బాధితురాలు తనిఖీ చేయడం, ఇప్పుడు రాయలపేటలో సరోజ, జ్యోతి మళ్లీ తన బస్సు ఎక్కడాన్ని డ్రైవర్ గమనించారు. సామాజిక బాధ్యతతో చౌడేపల్లె పోలీసులకు సమాచారం అందించారు. వారు గంగవరం పోలీసుల్ని అలర్ట్ చేశారు. బస్సు పలమనేరుకు వచ్చిన వెంటనే గంగవరం పోలీసులు తనిఖీ చేసి, సరోజను, జ్యోతిని అదుపులోకి తీసుకుని చౌడేపల్లె పోలీసులకు అప్పగించారు. మంగళవారం వారిని కోర్టు రిమాండుకు పంపించింది.

కుప్పం దాహం తీరుతోంది!



చిన్న కర్లగట్టలో రెండు రోజుల క్రితం వేసిన తాగునీటి బోరు

● 26గ్రామాల్లో తాగునీటి బోర్ల తవ్వకం
● రామకుప్పం మండలంలో రక్షిత మంచినీటి ట్యాంకులకు మరమ్మతులు

అయిదేళ్లపాటు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన కుప్పం నియోజకవర్గం తేరుకోవడం ప్రారంభమైంది. వైసీపీ పాలననాటి వివక్షాపూరిత వైఖరినుంచి బయటకు వచ్చి టీడీపీ పాలనలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపుగా పరుగులు ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరవడమే కాక, ఆయా నిధులతో పనులు కూడా ప్రారంభమై కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవడం మొదలైంది.

కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గాన్ని యేటా వర్షాభావం పట్టి పీడిస్తుంటుంది.సాధారణ వర్షపాతంకంటే చాలా తక్కువగా వానలు కురుస్తుండడంతో నిత్యం గ్రామాలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతుంటాయి.ఏడాదిగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గ్రామాలు క్రమేణా తాగునీటి ఎద్దడి సమస్యలోకి జారుతున్నాయి. గత వైసీపీ హయాంలో తాగునీటి ఎద్దడి నివారణకు పరిష్కారంగా చాలా గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. అంతకుముందు 2014-2019 మధ్యకాలంలో టీడీపీ హయాంలో సరఫరా చేసిన తాగునీటి ట్యాంకర్లకు బిల్లుల చెల్లింపులతోపాటు వైసీపీ హయాంలో ట్యాంకర్ల బిల్లుల చెల్లింపు కూడా కాకుండా అప్పట్లో సర్పంచులు, తాగునీటి సరఫరా కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైసీపీ సర్పంచులయితే ఈ సమస్యపై కుప్పంలోని గ్రామీణ నీటి సరఫరా కార్యాలయం ఎదుట చాలాసార్లు ధర్నాకు దిగడమే కాదు, అప్పటి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఇంటిఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికలు రెండుమూడు నెలల్లో జరుగుతాయనగా తమ సర్పంచుల నిరసనలనుంచి బయట పడడానికి ప్రభుత్వం తాగునీటి సరఫరా బిల్లులను క్లియర్ చేసింది. అయితే 2014లో టీడీపీ హయాం చివరలో రక్షిత మంచినీటి ట్యాంకుల మరమ్మతులు ప్రారంభించారు.మధ్యలో ప్రభుత్వం దిగిపోవడంతో పెండింగులో పడిన ఆ పనులను వైసీపీ హయాంలో పూర్తి చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి రూ.8 కోట్ల బిల్లులు పెండింగులోనే ఉండిపోయాయి. దీంతో రామకుప్పం మండలంలో రక్షిత మంచి నీటి ట్యాంకుల మరమ్మతు పనులు జరగలేదు. ఈ మండలంలో మొత్తం 110 పనులకుగాను రూ.4.17 కోట్లను మంజూరు చేస్తూ ఈనెల 11న ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రామకుప్పం మండలంలో ప్రస్తుతం ఈ నిధులతో ట్యాంకుల మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

● కరువు గ్రామాల్లో బోర్ల తవ్వకం

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించింది.ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో చాలాచోట్ల ఎప్పట్నుంచో తాగునీటి సమస్య నెలకొని ఉంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా ఇప్పటికే నాలుగు మండలాల్లోని మొత్తం 26 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తోంది. ఇందులో అత్యధికంగా శాంతిపురం మండలంలో 14 గ్రామాలున్నాయి. గుడుపల్లె మండలంలో 7, కుప్పం మండలంలో 4, రామకుప్పం మండలంలో ఒక గ్రామానికి తాగునీటి సరఫరా జరుగుతోంది. మొత్తం 26 గ్రామాల్లో 20 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుండగా, మిగిలిన 6 గ్రామాల్లో ప్రైవేటు వ్యవసాయ బోర్లతో టైఅప్ పెట్టుకుని సరఫరా చేస్తూ ఆయా గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు తీరుస్తున్నారు. అయితే రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇటీవల అంచనాలు తయారు చేసి పంపిన 118 పనులకు పాలనా అనుమతులు ఇస్తూ రూ.373.70 లక్షలను మంజూరు చేసింది. ఈ జీవో కూడా ఈనెల 11వ తేదీనే వెలువడింది. అయితే ఎక్కడెక్కడ తాగునీటి సమస్య నిజంగా ఉందో స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల ద్వారా గుర్తించి ఆయా పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్నారు. ఇప్పటికే తాగునీటి సరఫరా జరుగుతున్న 26 గ్రామాల్లో ఒకటొకటిగా ఈ నిధులతో తాగునీటి బోర్ల తవ్వకాలు జరుగుతున్నాయి. శాంతిపురం మండలంలో ఎక్కువ ఇటువంటి గ్రామాలున్నాయి కాబట్టి, అక్కడ ఎక్కువ బోర్లు వేస్తున్నారు. 64-పెద్దూరు పంచాయతీ సోమాపురం, సి.బండపల్లె పంచాయతీ చిగుర్లపల్లె, మొరసనపల్లె పంచాయతీ కనమలదొడ్డి, కర్లగట్ట పంచాయతీ వెంకటాపురం, గుడుపల్లె మండలంలోని సంగనపల్లె పంచాయతీ జోగిండ్ల గ్రామాలలో ఇప్పటికే తాగునీటి బోర్ల తవ్వకం పూర్తయింది. గత నాలుగైదు రోజుల్లోనే ఈ బోర్లు వేశారు. వీటికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తాగునీటి పైపులైన్లను అనుసంధానం చేసే పని మిగిలి ఉంది.తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి గ్రామీణ నీటి పారుదల శాఖ డీఈఈ పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన ఎస్డీఎఫ్ నిధులతో తొలుత తాగునీటి సరఫరా జరుగుతున్న గ్రామాల్లో బోర్ల తవ్వకం ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు. తర్వాత సమస్య తీవ్రతను బట్టి ఇతర గ్రామాల్లో బోర్ల తవ్వకం లేదా అదనపు పైపులైన్లు వేయడం వంటి పనులు జరుగుతాయని తెలిపారు.



వెంకటాపురంలో తాగునీటి ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టుకుంటున్న గ్రామీణులు

స్వర్ణ రథంపై వరసిద్ధుడి విహారం

ఐరాల(కాణిపాకం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర గణపతి వ్రతాన్ని అధికారులు వైభవంగా నిర్వహింపజేశారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశాక సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆస్థాన మండపానికి తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. విశేష పూజలయ్యాక ఉత్సవర్ల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహింపజేశారు. రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణ రథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



సంకటహర గణపతి వ్రతంలో పాల్గొన్న భక్తులు



దేవేరులతో స్వర్ణ రథంపై ఊరేగుతున్న వినాయకస్వామి



వీధిలో వరినాట్లు

ఈ మహిళలు వరినాట్లు వేసేది పొలంలో కాదు.. వీధిలో. వర్షపు నీటితో తమ ఇళ్ల మధ్యలో ఉన్న వీధి మడుగులా మారింది. దీనికి మట్టి తోలించడంలో పాలకుల నిర్లక్ష్యానికి నిరసనగా ఇలా వరినాట్లు వేశారు. ఈ ఘటన మంగళవారం దొరవారిసత్రం మండలం కల్లూరులో జరిగింది. ఏళ్ల తరబడి మడుగులా ఉన్న తమ వీధికి మట్టి తోలమని పంచాయతీ పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

నడుములు విరగతాయ్!

ఈ రోడ్డున వెళ్లేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా నడుములు విరగాల్సిందే. చంద్రగిరి-అనుప్పల్లె మార్గంలో మల్లయ్యపల్లె మలుపు వద్ద ఉన్న గుంతకు ఇటీవల అధికారులు తాత్కాలికంగా మట్టి పోశారు. వర్షాలకు మళ్లీ యథాస్థితికి చేరింది. ఇటీవల ద్విచక్ర వాహనదారుడు నడిరోడ్డుపై ఉన్న ఈ గుంతను చివర్లో చూసి అదుపు చేయలేక కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి





మల్లయ్యపల్లె వద్ద అదుపు తప్పి గాయపడిన ప్రయాణికుడు

అలారం మోగింది.. దొంగ పరారయ్యాడు

● నాయుడుపేటలో ఏటీఎం చోరీకి విఫలయత్నం



నాయుడుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గునపం తెచ్చాడు. ఏటీఎంను పగలగొట్టే ప్రయత్నం చేశాడు. ఇంతలో అలారం మోగడంతో.. దొంగ పరారయ్యాడు. లేదంటే ఏటీఎంలో నగదు అపహరించుకుని వెళ్లేవాడేమో? ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నాయుడుపేట బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది.

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో యాక్సెస్ బ్యాంకు ముందు గదిలో ఏటీఎం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం బ్యాంకు సిబ్బంది విధులను ముగించుకొని బ్యాంక్ షట్టర్ మూసేసి వెళ్లారు. అయితే ఏటీఎం గది మాత్రం తెరిచే ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఓ దుండగుడు మోటారు సైకిల్‌పై గునపంతో వచ్చాడక్కడకు. బ్యాంక్ ముందు మోటారు సైకిల్‌ను పెట్టాడు. ముఖానికి ప్లాస్టిక్ కవర్‌ను చుట్టుకొని, గునపం తీసుకుని ఏటీఎంలోకి వచ్చాడు. గునపంతో ఏటీఎం ముందు డోర్‌ను తొలగించాడు. అదే సమయంలో అలారం మోగింది. ఆ సమాచారం బ్యాంక్ హెడ్ ఆఫీసుకు వెళ్లింది. అక్కడ నుంచి నాయుడుపేట బ్యాంక్ మేనేజర్‌కు తమ ఏటీఎం వద్ద చోరీ జరుగుతున్నట్లు సమాచారం అందించారు. తక్షణమే బ్యాంక్ మేనేజర్.. అర్బన్ సీఐ బాబికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో రాత్రి గస్తీలో ఉన్న సీఐ.. హుటాహుటిన ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఆ దుండగుడు పరారయ్యాడు. ఏటీఎంలో ఉన్న నగదు మాత్రం చోరీకి గురికాలేదని సీఐ వెల్లడించారు.



ఏటీఎం డోర్‌ను గునపంతో కొడుతున్న దుండగుడు

సీసీ కెమెరాల్లో దుండగుడు

మోటారు సైకిల్‌పై ఏటీఎం దగ్గరకు చేరుకొని తిరిగి బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలోకి దుండగుడు ప్రవేశించిన సన్నివేశాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. అయితే ఎదురుగా వీధిలోకి ప్రవేశించిన తరువాత ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి వద్ద ఉన్న కెమెరాలో మాత్రం వీధిలోకి వెళ్తున్నది కనిపించింది. ఆ తర్వాత కెమెరాలు లేకపోవడంతో దుండగుడు ఎలా వెళ్లాడనేది అంతుపట్టడం లేదు. యాక్సెస్ బ్యాంక్ ఏటీఎం వద్ద రాత్రి సమయంలో సెక్యూరిటీ లేదని తెలిసి చోరీకి యత్నించినట్లు తెలుస్తోంది. ఇక, క్లూస్ టీమ్ ఎస్ఐ దస్తగిరి సంఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

రద్దీ ప్రాంతంలో..

నాయుడుపేట- శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు పక్కనే యాక్సెస్ బ్యాంకు ఏటీఎం ఉంది. రాత్రి వేళల్లో ఎప్పుడూ తిరుపతికి వెళ్లే బస్సులు, ఇతర వాహనాలతో ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. పోలీస్ గస్తీ కూడా అదే రహదారిలో ఉంటుంది. అయినా దుండగుడు గునపం తీసుకొని మోటారు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది.



చోరీకి యత్నించిన ఏటీఎం వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

● సమీక్షలు - సమావేశాలు

సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పించండి



సీఎం సూర్యఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులు

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్‌తో కలిసి ఆయన జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి పథకాన్ని అమలు పరచడానికి 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటిపైభాగంలో సౌర విద్యుత్ తయారు చేసుకుని వినియోగించుకోవచ్చన్నారు. దీనికి ప్రోత్సాహంగా ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలోవాట్లకు, ఆపైన యూనిట్లకు రూ.78వేలు చొప్పున కేంద్రం రాయితీ ఇస్తుందని వివరించారు. ఆసక్తి గల వారు 'పీఎంఎస్‌యూఆర్‌వైఏజీహెచ్ ఏఆర్.జీవోవీ.ఇన్, ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 ద్వారా సంప్రదించాలని సూచించారు. 100 కిలో వాట్లకు పైబడిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్‌వీవీఎన్, నెడ్ క్యాప్ ఫేజ్-1 సౌర విద్యుత్ ప్లాంట్లు అమర్చడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, మోడల్ సోలార్ విలేజ్ కోసం 5000 జనాభా ఉన్న ఐదు గ్రామాలను తీసుకుని సోలార్ గ్రామాలుగా తీర్చి దిద్దే ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి జిల్లాలో 112 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించినట్లు నెడ్‌క్యాప్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జుబేదా, డీపీవో సుశీల దేవి, లీడ్ బ్యాంక్ మేనేజరు విశ్వనాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజరు సునీల్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ పాల్గొన్నారు.

భూసేకణ పనులను వేగవంతం చేయండి

జాతీయ రహదారి, రైల్వేశాఖ, రెవెన్యూకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి భూసేకరణపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ డివిజన్ అధికారులు ఎప్పటికప్పుడు ఎన్.హెచ్. అధికారులతో సమన్వయం చేసుకుని రహదారుల పనులు పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. కాలూరు- పీలేరు, రేణిగుంట- నాయుడుపేట, గూడూరు- సూళ్లూరుపేటకు సంబంధించిన సాగరమాల రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ పనులు చేపట్టండి

తిరుపతి నగరంలోని చెరువుల సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి నగరంలోని వివిధ చెరువులు, కుంటల సుందరీకరణ పనుల పురోగతిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్‌తో కలిసి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి చెరువులు పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వినాయక సాగర్, పాన్‌చెరువు, గొల్లవానికుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా వినాయక సాగర్, గొల్లవానిగుంట అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తుడా అవిలాలచెరువు అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టీటీడీ గురువారం విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ టికెట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. కాగా, మరికొన్ని ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోటాను టీటీడీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వీటిని భక్తులు బుధవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఇక, అంగప్రదక్షిణ టికెట్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు విడుదల చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

ఈ విద్యార్థి ఏమయ్యాడు?



కాశ్యప ఆదిత్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్న కాశ్యప ఆదిత్య (19) అదృశ్యమయ్యాడు. ఈమేరకు ఆదిత్య సోదరుడు హైదరాబాదు నుంచీ పోలీసులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అదృశ్యమైన విద్యార్థికి సంబంధించిన ఫోన్, ఐడీ కార్డు సంస్కృత వర్సిటీలోని గరుడాచలం హాస్టల్‌లోనే వదిలి వెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆటోలో బయటికి వెళ్లినట్టు యూనివర్సిటీ హాస్టల్ సీసీ ఫుటేజీలో రికార్డు అయినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై వెస్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

24నుంచి గ్రామీణ ప్రీమియర్‌లీగ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నుంచి 16వ గ్రామోత్సవం, రూరల్ ప్రీమియర్‌లీగ్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ శుభంబన్సల్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహేబ్, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. 24న ఎస్వీయూ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తొలివిడతగా పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగనున్నాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న ప్రతి పంచాయతీ క్రీడా జట్లు ఈ పోటీలకు అర్హులు. ముందస్తు నమోదు తప్పనిసరి. మరిన్ని వివరాల కోసం 83000 30999 నెంబరులో సంప్రదించాలి. ఈ పోటీల్లో మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకొన్న జట్లు జోనల్‌స్థాయి పోటీలకు అర్హత సాధించి విజయవాడలో డిసెంబరు మొదటి వారంలో జరిగే పోటీలలో పాల్గొంటారు. అక్కడి విజయం సాధించిన జట్లు డిసెంబరు 28న కోయంబత్తూరులోని ఇషా కేంద్రంలో జరిగే తుది సమరంలో పాల్గొంటాయి.


- వాలీబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.9వేలు, రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాలుగో బహుమతి రూ.2వేలు.
- త్రోబాల్ విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, నాల్గో బహుమతి రూ.1,500.



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో

ప్రభుత్వ భూములను గుర్తించి కాపాడండి

రామచంద్రాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టుగుంట రామాపురంలో సర్వే నంబరు 102లోని 288 ఎకరాలను ఆర్డీవో రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. గతంలో గంగిరెడ్డిపల్లి, మిట్టూరు, సి.రామాపురం దళితులకు 141 ఎకరాలను కేటాయించామని అధికారులు ఆయనకు వివరించారు. అన్నస్వామి గండిచెరువుకు 20 ఎకరాలు, కాలువలు, రహదారులకు 28 ఎకరాలు కేటాయించామన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమి 58 ఎకరాలు ఉన్నట్లు ఆర్డీవో గుర్తించారు. అన్నాసామి గండిచెరువు, సీజేఎఫ్ఎస్ భూములు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలని తహసీల్దారు వెంటకరమణ, సర్వేయర్ రమేష్‌బాబును ఆదేశించారు. 58 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించుకునేందుకు ల్యాండ్ బ్యాంకింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.



మాల కార్పొరేషన్ సభ్యురాలిగా కుమారమ్మ

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యురాలిగా తిరుపతికి చెందిన తెలుగు మహిళా నేత పురిమిట్ల కుమారమ్మ నియమితులయ్యారు. ఎస్సీల సంక్షేమం కోసం కృషిచేస్తానని ఆమె చెప్పారు.

అభివృద్ధికి పచ్చజెండా

● 'పద్మావతి' వర్సిటీ పాలకమండలిలో పలు తీర్మానాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో అభివృద్ధికి మంగళవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్ర ఉన్నత విద్య, ఆర్థిక శాఖల అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొనగా, పద్మావతి వర్సిటీ నుంచీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఇటీవల యూనివర్సిటీకి మంజూరైన రూ.100 కోట్ల పీఎం ఉష పథకం నిధులను భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించడంపై చర్చించారు. విద్యుత్ ఖర్చును తగ్గించడం కోసం సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు పాలకమండలి పచ్చజెండా ఊపింది. వెబ్‌సైట్, ఇంటర్‌నెట్, సీసీ ఫుటేజీల నిర్వహణ, వంటి అంశాల్లో నాణ్యతను పెంపొందించాలని తీర్మానించినట్టు తెలిసింది.

అమ్మవారి సేవలో ఉత్తరాది మఠం పీఠాధిపతి

తిరుచానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని మంగళవారం ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామీజీ శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూల మూర్తిని వారు దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద సత్యాత్మతీర్థ స్వామీజీ

పార్శిల్ కేంద్రాల్లో పోలీసుల తనిఖీలు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పార్శిల్ కేంద్రాల్లో పోలీసులు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన కోసం తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సూళ్ళూరుపేట, వాకాడు, సత్యవేడు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పార్శిల్ కేంద్రాల నుంచి రవాణా అవుతున్నాయనే అనుమానంతో డీఎస్పీల నేతృత్వంలో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తనిఖీలు చేశారు. తిరుపతిలో రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఈస్ట్ సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977 కు ఫోన్ చేసి సమాచారం అందివ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

● 35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి 35 దుంగలు, ఒక కారు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్‌ఐలు కేఎస్‌కె లింగాధర్, టి.విష్ణువర్ధన్‌కుమార్, సిబ్బంది ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టులో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు ఒక కారులో వేగంగా రావడాన్ని గమనించి ఆపి తనిఖీ చేయగా అందులో పది దుంగలు ఉన్నాయి. ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు తమిళనాడుకు చెందిన వారని గుర్తించారు. కారులోని దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో కడప సబ్ కంట్రోల్‌లోని ఆర్ఐ ఎం.చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం చంద్రగిరి మండలం పాతవాటివారిపల్లెకు సమీపంలో అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్ద కొంత మంది ఎర్రచందనం దుంగలను ఓ లారీలో తరలించేందుకు లోడ్ చేస్తుండగా చుట్టుముట్టడంతో స్మగ్లర్లు పారియారు. అందులోని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 ఎర్రచందనం దుంగలను, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్ కర్నాటకకు చెందిన వాడుగా గుర్తించారు. రెండు సంఘటనల్లో పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలను, వాహనాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐఎం సురేష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు వెనుక ఉన్న ఇతర స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

పాఠశాల పనివేళల పెంపు ఆలోచన విరమించుకోవాలి : ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పనివేళల పెంపు ఆలోచన విరమించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, మోహన్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల సలహాలు పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కాలేజీలుగా మార్చుచేయాలని కోరుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు మరో ప్రకటనలో తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని చిన్నారి దుర్మరణం


సుదర్శనశ్రీ మృతదేహం

యాదమరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొనడంతో నాలుగేళ్ల చిన్నారి దుర్మరణం చెందింది. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని వరిగపల్లెలోని ఇటుకల బట్టీలో ముత్తులక్ష్మి, అయ్యప్పన్‌లు పనిచేస్తున్నారు. వీరి కుమార్తె సుదర్శనశ్రీ (4) గ్రామంలో మంగళవారం ఆడుకుంటుండగా ఓ ట్రాక్టర్ వెనక్కు నడిపే టప్పుడు ప్రమాదశాత్తూ ఢీకొంది. వెనుక టైరు కింద బాలిక పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్రైవర్ వడివేలును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వారంలోగా 50శాతం రైతుల వాటా సేకరించాలి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి ఉద్యానశాఖ అధికారులు ఈ వారంలోగా 50 హెక్టార్లకు తక్కువకాకుండా రైతుల వాటా సేకరించేలా కృషిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బిందు, తుంపర్ల సేద్య పరికరాలు సబ్సిడీతో రైతులకు అందించే అంశంపై సమీక్షించారు. జిల్లాలో 502 రైతు శిక్షణ కేంద్రాల (ఆర్ఎస్‌కే) పరిధిలో 27,723 హెక్టార్లకుగాను 27,980 మంది రైతుల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 10,962 హెక్టార్లకు సంబంధించి ప్రాథమిక తనిఖీలు పూర్తయ్యాయని, వీటిలో 2860 హెక్టార్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేశానన్నారు. 1287 హెక్టార్లలో 1513 మంది రైతులకు బిందు, తుంపర్ల సేద పరికరాలు అందించినట్లు వివరించారు. సబ్సిడీ ధరతో పరికరాలు కావాల్సిన రైతుల నుంచి వాటా రుసుం త్వరితగతిన చెల్లించేటట్లు వారిలో అవగాహన కల్పించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ హిమవంశి, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీఎంఐపీ జిల్లా అధికారి బాలసుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం: ఒకరి అరెస్టు


జయగోపి

నగరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్రప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను రెవెన్యూ అధికారులు, పోలీసులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారంతో మంగళవారం చేపట్టిన వాహన తనిఖీల్లో 18 బస్తాల (815 కిలోల) రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను గుర్తించి, సీజ్ చేశారు. రవాణా చేస్తున్న జయగోపి (26)ని అరెస్టు చేసినట్లు నగరి సీఐ మహేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ మేఘవర్ణం, వీఆర్వో విజయసింహారెడ్డి, ఏఎస్ఐ ఏసు, పోలీసులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డును మార్చేసి.. రూ.లక్ష కొట్టేశాడు

చిత్తూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డును మార్చేసి రూ.లక్ష చోరీ చేసిన ఘనుడిపై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని భరత్‌నగర్‌కు చెందిన రిటైర్డు ఉద్యోగి దొరస్వామి భార్య సుజాత మంగళవారం ఎస్బీఐ మెయిన్‌బ్రాంచి ఏటీఎంకు వెళ్లారు. అక్కడున్న ఓ వ్యక్తి డబ్బులు తీసిస్తామని నమ్మించి. ఆమె ఏటీఎం కార్డును తీసుకున్నాడు. ఆ తర్వాత ఆమె అడిగిన మొత్తాన్ని తీసిచ్చాడు. ఈ సమయంలో నకిలీ ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చాడు. గమనించిన ఆమె ఆ కార్డు తీసుకుని వెళ్లిన నిమిషాల వ్యవధిలోనే రూ.లక్షను డ్రా చేసేశాడు. ఈ మెసేస్ ఫోన్‌కు రావడంతో ఆమె తన భర్తకు చూపించారు. దాంతో డబ్బును ఎవరో కొట్టేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి భర్త దొరస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనాల దొంగకు ఆరునెలల జైలు


గోవిందరాజులు

చిత్తూరు లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఉంచిన ద్విచక్ర వాహనాలను చోరీచేసిన ఓ దొంగకు చిత్తూరు కోర్టు ఆరునెలల జైలుశిక్ష విధించింది. యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ గుట్టకింద దళితవాడకు చెందిన గోవిందరాజులు 2023 జూన్‌లో బంగారుపాళ్యానికి చెందిన రాజు, గిరి బాబు అనే వ్యక్తులకు చెందిన ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు ఆపివుండగా చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి గోవిందరాజులును రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాయిదారాగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఉమాదేవి.. నిందితుడికి జైలుశిక్ష విధించారు.

అసెంబ్లీ తీర్మానంపై హర్షం



స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇక పిల్లలు అడ్డుకాకపోవడాన్ని స్వాగతిస్తున్న రాజకీయ పక్షాలు, ఆశావహులు

చిత్తూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేటర్ వంటి పోస్టులకు పోటీ చేసేవారికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద వెసులుబాటు కల్పించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే పోటీ చేయకూడదనే నిబంధనను తొలగిస్తూ తాజాగా అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీంతో జిల్లాలోని స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఎదురుచూస్తున్న ఆశావహులకు పెద్ద ఉపశమనం కలిగినట్లయింది. జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాలు దీన్ని స్వాగతిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 1411 గ్రామ పంచాయతీలుండగా.. 2021 ఫిబ్రవరిలో 1369 చోట సర్పంచి ఎన్నికలు జరిగాయి. కోర్టు కేసుల కారణంగా అప్పట్లో 42 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు. అలాగే 857 ఎంపీటీసీ, 65 జడ్పీటీసీ స్థానాలకూ అప్పట్లోనే ఎన్నికలు జరిగాయి. చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లలో 50చొప్పున వంద కార్పొరేటర్ స్థానాలు.. పలమనేరు 26, పుంగనూరు 31, పుత్తూరు 27, నగరి 29, కుప్పం 25, మదనపల్లె 35 చొప్పున కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికల్లో జరిగాయి. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో 35 కౌన్సిలర్ స్థానాలున్నా.. కోర్టు కేసుల కారణంగా అక్కడ ఎన్నికలు జరగలేదు. ఇలా మొత్తంగా అన్నిరకాల స్థానిక సంస్థల్లో 2641 పోస్టులున్నాయి. వైసీపీ దౌర్జన్యాలను చూసి అప్పట్లో టీడీపీ ఎన్నికల్ని బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గొడవల కారణంగా కొన్నిచోట్ల నవంబరు వరకు ఎన్నికలు జరిగాయి. 2026 ఫిబ్రవరి ప్రారంభంలో వీరందరి ఐదేళ్ల పదవీకాలం ముగుస్తుంది. దీంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. 2641 మందికి పలు పదవులు దక్కే అవకాశముంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల క్షేత్ర స్థాయి నాయకులు ఇప్పటినుంచే ఆశలు పెట్టుకున్నారు. తాజాగా అసెంబ్లీలో తీర్మానించిన బిల్లుతో అలాంటి ఆశావహులకు మరింత వెసులుబాటు దక్కింది.

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు

- జడ్పీటీసీలు 65
- ఎంపీటీసీలు 857
- సర్పంచులు 1411
- కార్పొరేటర్లు 100 (చిత్తూరు : 50, తిరుపతి : 50)
- కౌన్సిలర్లు 208 (శ్రీకాళహస్తి : 35, మదనపల్లె : 35, పుత్తూరు : 27, నగరి : 29, పలమనేరు : 26, పుంగనూరు : 31, కుప్పం : 25)

సీఎం చంద్రబాబు చొరవ

సీఎం చంద్రబాబు అవకాశం దొరికినప్పుడల్లా పిల్లల్ని కనండి అంటూ ప్రజలకు పిలుపునిస్తున్నారు. యువతరంతోనే రాష్ట్రాభివృద్ధి సాధిస్తుందని ఆయన నమ్ముతున్నారు. దేశవ్యాప్తంగా యువకుల సంఖ్య కంటే వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సీఎం చొరవ తీసుకున్నారు. సోమవారం అసెంబ్లీలో ఇద్దరు పిల్లలకు మించి ఉన్నా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చనే తీర్మానాన్ని ఆమోదించారు.

ఆశలు నెరవేర్చుకోవచ్చు



నేను ఐరాల మండలంలోని గుండ్లపల్లె ఎంపీటీసీగా చేశాను. ప్రభుత్వం చెప్పిన కటాఫ్ తేదీకి ముందే ముగ్గురు పిల్లలు ఉండడంతో నాకు అభ్యంతరం లేదు. జనాభా తగ్గిపోతున్న క్రమంలో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంతో స్థానిక సంస్థలకు పూర్వ వైభవం వచ్చింది. తాజా తీర్మానంతో చాలా మందికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. రాజకీయ ఆశలు నెరవేర్చుకోవచ్చు.

- సింగంశెట్టి సుబ్బరామయ్య, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అప్పట్లో రెండోసారి పోటీ చేయలేకపోయాను



నేను 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కౌన్సిలర్‌గా గెలిచాను. ఆ తర్వాత టీడీపీలో చేరాను. అప్పటికి నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. తర్వాత కుమారుడు పుట్టడంతో.. మళ్లీ జరిగిన ఎన్నికల్లో పోటీ చేయలేకపోయాను. ప్రభుత్వం తాజాగా అసెంబ్లీలో తీర్మానించిన బిల్లుతో నాలాంటి చాలామందికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. రాజకీయంగా ఎదగవచ్చు.

- శరవణ, మాజీ కౌన్సిలర్, సంతపేట, చిత్తూరు

మాజీ సైనికుల సమస్యలు తెలుసుకోవడమే ఎంఈజీ ఉద్దేశం

● ట్రైనీ కలెక్టర్, ఏఎస్పీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ట్రైనీ కలెక్టర్ హిమవంశి, తదితరులు - అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన ఎంఈజీ సభ్యులు

చిత్తూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలను తెలుసుకోవడమే మద్రాస్ ఇంజనీర్స్ గ్రూప్ (ఎంఈజీ) ముఖ్య ఉద్దేశమని ట్రైనీ కలెక్టర్ హిమవంశి, ఆపరేషన్స్ ఏఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు అన్నారు. 244 బెటాలియన్ రెజిమెంటల్ కమాండర్స్ కాన్ఫరెన్స్ వార్షికోత్సవం సందర్భంగా ఎంఈజీ, మాజీ సైనికుల సమస్యలను తెలుసుకోవడానికి కన్నియాకుమారిలో ప్రారంభించిన బైక్ ర్యాలీ మంగళవారం చిత్తూరుపరేడ్ మైదానానికి చేరుకుంది. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ విశాల్ రాఘూర్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నోయల్ వికాస్ మోసీస్, 95 ఏళ్ల మాజీ సైనికుడు చొక్కలింగం హాజరయ్యారు.ఈసందర్భంగా ఎంఈజీ సభ్యులు.. మాజీ సైనికులు, వితంతువుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పరేడ్ మైదానం నుంచి ర్యాలీగా పాత పోలీసు మైదానంలో ఉన్న అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నివాళి అర్పించారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి కేవీ రాఘవులు, మాజీ సైనిక సంక్షేమం సంఘం నేతలు పాల్గొన్నారు.

నేనీ స్థాయికి రావడానికి గ్రంథాలయాలే కారణం

జిల్లా పంచాయతీ అధికారి పార్వతి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

చిత్తూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాను ఈ స్థాయికి రావడానికి గ్రంథాలయాలే కారణమని జిల్లా పంచాయతీ అధికారి పార్వతి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి గ్రంథాలయాలకు వెళ్లడం ఇష్టమన్నారు. వీటిల్లోని పుస్తకాలు చదివే ఇంతటిదాన్ని అయ్యానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఎటువంటి సందర్భంలోనైనా ధృడంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. ఈ కార్యక్రమంలో పీసీఆర్ హెచ్ఎం పూర్వాని, విజయం సంస్థల కరస్పాండెంట్ శైలజ, రచయిత్రి అరుణకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులను బోధించడానికి (పార్ట్‌టైం) ఆసక్తిగల వారు ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

15లోపు పంటల బీమా చేసుకోవాలి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు డిసెంబరు 15లోపు పంటల బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి పంటల బీమా యోజన కింద చేపట్టే నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో భూ రికార్డుల ఏకీరణతో రైతుల నమోదు చేసుకోవాలని సూచించారు. రబీలోని సాధారణ పంటలకు డిసెంబరు 15లోపు, జీడిపప్పు సాగుకు 21లోపు, వరి సాగుకు 31లోపు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ఓవరాల్ చాంపియన్‌షిప్ షీల్డ్ అందుకుంటున్న రామకుప్పం విద్యార్థులు

రామకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కడప జిల్లా గండి క్షేత్రంలో జరిగిన అంతర్ కళాశాలల, పాఠశాలల నాలుగో జోన్ పోటీల్లో రామకుప్పం డా.అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాకు చెందిన జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో రామకుప్పం గురుకుల విద్యాలయం విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. సీనియర్ విభాగం వాలీబాల్ పోటీల్లో విద్యాలయం జట్టు విజేతగా నిలిచిందన్నారు.. చదరంగంలో విద్యాలయం విద్యార్థి ప్రవంత్, డిస్కస్‌త్రోలో భరత్‌కుమార్, జావెలిన్‌త్రోలో జశ్వంత్‌లు ప్రథమస్థానంలో నిలిచారన్నారు. జూనియర్ విభాగంలో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో అజిత్‌నాయక్ ప్రథమస్థానంలో నిలిచాడని వివరించారు. పోటీల్లో తమ విద్యాలయం అధిక పాయింట్లు సాధించిందని ఆయన తెలిపారు. జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, పీడీలు ప్రతాప్, జబీర్‌లను డీసీఓ పద్మజ, ప్రిన్సిపాల్ రాజేంద్ర అభినందించారు. త్వరలో తూర్పు గోదావరి జిల్లా పెదవేగిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత ప్రతిభచాటాలని వారు ఆకాంక్షించారు.

మామిడిలో ఈగ తెగులు నివారించండి


సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మామిడిలో ఈగ తెగులు నివారణ చేపట్టి అధిక దిగుబడి పొందాలని ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. హైదరాబాదు వారి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, రీజనల్ హార్టికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉద్యాన శాఖ సమావేశ మందిరంలో మామిడిలో ఈగ తెగులు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తయారు చేసిన బుట్టలను చెట్లకు కడితే ఈ తెగులు దాదాపు నివారించుకోవచ్చునని సూచించారు. అనంతరం తెగులు నివారణపై పలువురు మాస్టర్ ట్రైనీలు వివరించారు. ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని భార్య మృతి

● భర్తకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన క్రిష్టప్ప

గంగవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు - బెంగళూరు జాతీయ రహదారిలో గంగవరం మండలంలోని గండ్రాజుపల్లె సమీపంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో భార్య మృతిచెందింది. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం చిక్కోనితోపు గ్రామానికి చెదిన క్రిష్టప్ప(43), సుమమ్మ(35) దంపతులు. వీరు కర్ణాటక రాష్ట్రం నంగిలి గ్రామంలో బంధువుల వివాహానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. గండ్రాజు పల్లె సమీపంలో బెంగళూరు వైపు వెళ్తున్న కేఏ13సి0123 నెంబరు గల కారు వెనుక నుంచి ఢీకొంది. భార్య సుమమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. క్రిష్టప్ప తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు సుమమ్మ మృతదేహాన్ని, గాయపడిన ఆమె భర్తను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అయన్నా క్రిష్టప్పను చిత్తూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం సీఐ ప్రసాద్ తెలిపారు.

సేద్యానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

పుంగనూరు రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం స్థానిక ట్రావెల్స్ బంగ్లాలోని అతిథిగృహంలో జరిగిన పుంగనూరు డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖాధికారుల సమావేశంలో ఆయన మాట్లా డారు. విద్యుత్ బకాయిలు ఉన్న రైతులు సకాలంలో చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో నివాసం ఉన్న ప్రతి ఒక్కరూ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, ప్రభుత్వం వారికి 200 యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తున్నట్లు విరించారు. అక్రమంగా కనెక్షన్ తీసు కుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 15కేవీకే నుంచి 25కేవీకేగా మార్పు చేసుకోవడానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు కావాల్సిన రైతులు రూ.12500 చెల్లించాల్సి ఉందన్నారు. ఎక్కడా లో ఓల్టేజ్ సమస్య లేకుండా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ లైన్ల పనులు త్వరలోనే చేపడు తామని తెలియజేశారు. ఈ సమావేశంలో టెక్నికల్ డీఈఈ జగదీష్, డీఈఈ శ్రీనివాసమూర్తి, సురేష్, ఏడీఈ శ్రీనివాసులు, చిన్నబ్బ, నరేంద్ర, ఏఈలు శశిధర్, మహేంద్రరెడ్డి, ధనంజయ మూర్తి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకూ రాజ్యాంగం



డిజిటల్ కాలంలో ఈ బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు.. 74 ఏళ్ల కిందటి నేతల్లా.. తలపై తెల్ల టోపీలతో విద్యార్థులు ఫొటోలు దిగడం ఏంటని అనుకుంటున్నారా? మనకు స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసి.. రాజ్యాంగాన్ని రూపొందించిన విషయం తెలిసిందే. అదే తరహాలో శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలకూ రాజ్యాంగం రూపొందించాలని యోచించారు. ఈ మేరకు మంగళవారం రాజ్యాంగ రచన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేసి చైర్‌పర్సన్‌గా ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి.. రచనా సంఘం అధ్యక్షుడిగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ వ్యవహరించారు. హక్కుల కమిటీ, బాధ్యతల కమిటీ, విధివిధానాల కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. వాటికి అధ్యక్షులుగా ఉపాధ్యాయులు, సభ్యులుగా విద్యార్థులను నియమించారు. భారత రాజ్యాంగాన్ని పోలి ఉండేలా రూపొందించి.. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 'పాఠశాల రాజ్యాంగంలో రాజ్యాంగ ప్రవేశికతో పాటు 247 నిబంధనలు, 19 భాగాలు, నాలుగు షెడ్యూళ్లు ఉన్నాయి. 26న రాజ్యాంగ పరిషత్ సమావేశమై ఆమోదిస్తుంది. దీనిని జనవరి 26 నుంచి అమలు చేస్తాం' అని హెచ్ఎం రాజకుమారి తెలిపారు. కాగా, భారత రాజ్యాంగం రచనా కాలంలో నేతల వేషధారణతో విద్యార్థులు, టీచర్లు బ్లాక్ అండ్ వైట్ ఫొటో దిగారిలా. ఈ వినూత్న కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ

● 24వ తేదీ దరఖాస్తుకు గడువు

తిరుపతి(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ సంచాలకుడు చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్‌కు చెందిన 220 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఆ సమయంలో స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేయనున్నారు. బీఈడీ ఉత్తీర్ణులైన వారికి స్కూల్ అసిస్టెంట్ శిక్షణ, డీఈడీ ఉత్తీర్ణులైన వారికి ఎస్జీటీకి శిక్షణ ఇవ్వనున్నారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుచేసుకోవచ్చు. బయోడేటాతో పాటు బీఈడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే) పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత పరిచి ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తిరుపతి నగరం ముత్యాలరెడ్డిపల్లి, శ్రీకృష్ణా నగర్ మొదటి క్రాస్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులను అందజేయాలి. మరిన్ని వివరాలకు స్టడీ సర్కిల్లోగాని, 94414 56039, 99850 22254, 93462 21553 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేసులు

పలమనేరు, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులు కేవలం తమ పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా నిత్యం గ్రంథాలయానికి వెళ్లి వివిధ పుస్తకాలను చదవాలని అప్పుడే మరింత విజ్ఞానం పెరుగుతుందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేసులు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కళాశాలలో లైబ్రేరియన్ వెంకటసుధ ఆధ్వర్యంలో విద్యా ర్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కేవీ చిదంబరం, కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ నందీశ్వ రయ్య, లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్.కెవాసు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి

పలమనేరు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : దేశ సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ బీజేపీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శరవణ పిలుపునిచ్చారు. మంగళవారం పలమనేరులో జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఇంకా సభ్యత్వం పెంచాలని కోరారు. బీజేపీ నాయకులు గోవిందస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సులభరీతిలో బోధించాలి

బైరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభరీతిలో బోధించి వారిలోవున్న సామర్థ్యాన్ని వెలికితీయాలని డీవైఈవో చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో మంగళ వారం జరిగిన ఉపాధ్యాయుల సీఆర్పీ శిక్షణాతరగతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ హెచ్‌ఎంలు రామారావు, గౌహర్‌సుల్తానా, రిసోర్స్‌పర్సన్ మోహన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దబాలశిక్ష పుస్తకాల వితరణ



బైరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని వివిధ పాఠశాలలకు మంగళవారం పలమనేరు తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసి నాథం నాయుడు పెద్దబాలశిక్ష పుస్తకాలను వితరణగా అందజేశారు. బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సీఆర్పీ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పెద్దబాలశిక్ష పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో కార్వేటికొండపై రక్షణ గోడ



బైరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసార్లపల్లె సమీపంలో వున్న కార్వేటికొండ ధ్యానాభిరామ స్వామి ఆలయం వద్దకు వెళ్లే దారిలో మెట్లకు ఇరువైపులా దాతల సహకారంతో రక్షణ గోడలు నిర్మించారు.

విద్యలో నాణ్యత పెంచాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఉర్దూ డీవైఈవో ఆఫ్సర్‌ఖాన్

పుంగనూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యలో నాణ్యతపెంచి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని చిత్తూరు ఉర్దూ డీవైఈవో ఆఫ్సర్‌ఖాన్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఉర్దూ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ అర్థం కాని విషయాలు వస్తే వెంటనే ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం నకీవుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాతి మసీదు భూములు రిజిస్టర్ చేయరాదు


సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాతిమసీదుకు చెందిన భూములను రిజిస్టర్ చేయరాదని రాతి మసీదు కమిటీ సభ్యులు మంగళవారం సబ్ రిజిస్ట్రార్ నరేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాతిమసీదుకు సంబంధించిన సర్వే నంబర్లు 415, 416, 13/1, 9/11, 7/3ఏలో ని భూములను కొంతమంది రిజిస్టర్ చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఈ సర్వే నంబర్లులో కొంతకాలం రిజిస్టర్ చేయరాదని కోరినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు బందార్లపల్లెలో
'మన పంచాయతీకి మన చంద్రన్న ప్రభుత్వం'

రామకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం బందార్లపల్లెలో బుధవారం కడ పీడీ వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో 'మన పంచాయతీకి మన చంద్రన్న ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కడ పీడీ స్వయంగా ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బందార్లపల్లె పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలపై మాత్రమే ప్రజలు వినతులు సమర్పించాలని ఆయన కోరారు.

బస్సులో గొలుసు చోరీ కేసులో
ఇద్దరు మహిళల అరెస్టు

చౌడేపల్లె, నవంబరు19:(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగులో బంగారు చైను చోరీ చేసిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ కథనం మేరకు.. సోమవారం పుంగనూరుకు చెందిన సరస్వతమ్మ బ్యాగులో బంగారు చైను పెట్టుకుని సదుంలోని బంధువుల ఇంటికి బస్సులో బయలు దేరింది. చిత్తూరుకు చెందిన సరోజ, జ్యోతి కూడా అదే బస్సు ఎక్కారు. సరస్వతమ్మ బ్యాగులోని బంగారు చైను చోరీ చేసి చౌడేపల్లెలో బస్సు దిగేశారు. తర్వాత పలమనేరు వైపు వెళ్లే బస్సులో వెళ్లిపోయారు. గంగవరం వద్ద సీఐ తన సిబ్బందితో బస్సు ఆపి తనిఖీచేసి నిందితులను గుర్తించారు. వారి నుంచి చైను స్వాధీనం చేసుకుని మంగళ వారం రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధ తాళలేక
వ్యాపారి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ చిరువ్యాపారి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బిక్కింవారిపల్లెకు చెందిన వెంకటరమణ(45) చిన్నిచిన్న వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇటీవల వ్యాపారాల్లో నష్టాలు రావడంతో అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు కట్టలేక, అప్పులు తీర్చలేక ఈగల మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పురందేశ్వరిని కలిసిన తులసీనాథ్



కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జిల్లా బీజేపీ నాయకుడు తులసీనాథ్ కలిశారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. జిల్లాతోపాటు కుప్పం నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు, రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు.

కేడీసీ క్యాంపస్
ఇంటర్వ్యూల్లో నలుగురి ఎంపిక



కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యాసంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాలలో మంగళవారం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధా రాణి, టీపీవో పార్తిబన్, అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

కుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కుప్పం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిహ్నాలకు వెదకడం, నచ్చిన అంశంపై మాట్లాడడం అనే విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అలాగే ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సాయంత్రం గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపి, పిల్లలకు ఆటల పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

అటెండర్ లక్ష్మమ్మకు ఘన సన్మానం



పలమనేరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): నార్తు పాఠశాలలో 45 ఏళ్లుగా అటెండర్‌గా ఉచిత సేవలను అందిస్తున్న లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. 57వ శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా దినోత్సవంలో మంగళవారం ఆమెను గ్రంథాలయం ఆధ్వర్యంలో సత్కరించారు. లక్ష్మమ్మకు శాలువ కప్పి, పూలమాల వేసి, నూతన దుస్తులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధి కారి హేమంత్‌కుమార్, సంఘసేవకులు శ్రీపురం సీతారామయ్య, యోగాగురువు నంద గోపాల్, టీచర్లు పాల్గొన్నారు.

ఖాతాలో రూ.2లక్షల గల్లంతు


నగదు డ్రా అయినట్లు చూపుతున్న బాధితుడు గురుమూర్తి

పలమనేరు, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.2లక్షల నగదు గల్లంతు అయిందని ఓ బాధితుడు మంగళ వారం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు..పెద్దపంజాణి మండలం తమ్మిరెడ్డిపల్లి కి చెందిన గురు మూర్తికి పలమనేరు యూనియన్ బ్యాంకులో 18181010 0060197 ఖాతా ఉంది. ఇందులో 4.30 లక్షలు నిల్వ ఉండగా ఈనెల 15న రూ.99వేలు, 16న రూ.1, రూ.98వేలు, రూ.1999లు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. తాను ఎటువంటి లావాదేవీలు జరపలేదని అయినా డబ్బు గల్లంతైందని వాపోయాడు.

పరిహారం చెల్లించండి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతిగుట్లపల్లె రైతులు

పుంగనూరు, నవంబరు19 (ఆంధ్ర జ్యోతి): ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళ వారం మండలంలోని నేతిగుట్లపల్లె రైతులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతిగుట్లపల్లె సమీపంలో గత ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్ట్ వద్ద దాదాపు 17 గ్రామాల రైతులు భూములు కోల్పోయినట్లు తెలిపారు. ఏడాదికి రెండు, మూడు పంటలు పండేవన్నారు. ఎకరాకు లీజు రూ. 25వేలు ఇస్తామని నమ్మించి రూ.15వేలు మాత్రమే ఇచ్చినట్లు వాపోయారు. ఈ లీజు సరిపోదని ఏడాదికి రూ.30వేలు లీజు ఇప్పించాలని కోరారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లీజు నగదును ఇప్పించాలని విన్నవించారు. అలాగే చెల్లించాల్సిన నష్టపరిహారం ఒకేవిడతలో చెల్లించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కోలాట వెంకటరమణ, పులి వెంకటరమణ, ఓబుల్‌రాజు, రామమూర్తి, కృష్ణమూర్తి, నరేశ్, సతీశ్, కుమార్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు తీర్చడానికే 'పొలం పిలుస్తోంది'


భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ఏఓ

కల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు తీర్చడానికే ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని చేపడుతోందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లి, వంకమద్దివారి పల్లిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. రైతులకు భూసార పరీక్షపత్రాలు అందజేసిన అనంతరం పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులు పుస్తకపఠనం అలవర్చుకోండి


మహిళాధికారులను సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

వి.కోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు కృషి చేయాలని పెద్దపంజాణి ఎస్ఐ స్వర్ణతేజ అన్నారు. 57వ గ్రంథా లయ వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలను గుర్తించి వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగంతో వారి విలువైన కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువులను అశ్రద్ధచేయకుండా చక్కటి ప్రణాళికతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ, కళాభారతి వ్యవస్థాపకులు రఘుపతి, డా.ఉదయ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురి అరెస్టు

చౌడేపల్లె, నవంబరు19,(ఆంధ్రజ్యోతి): మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పుంగనూరు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మండలంలోని దాదేపల్లె వద్ద రాయలపేటకు చెందిన రవిజెట్టి(47) అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. అతడి నుంచి 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చుక్కావారిపల్లె వద్ద మదనపల్లె మండలం కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన గంగాధర్ (49) మద్యం విక్రయిస్తుండగా అరెస్టుచేశారు. అతడి నుంచి 13 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బోయకొండ వద్ద పుంగనూరుకు చెందిన రమేష్(41) అక్రమంగా నిల్వ ఉంచిన 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు వేణు గోపాల్‌రెడ్డి, జవహర్‌బాబు, ఆశోక్, సిబ్బంది సుబ్రహ్మణ్యంగౌడ్, నాగ రాజు, తంబేష్, దశరథ నాగరాజు, నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

అటవీ భూముల జాయింట్ సర్వే


సర్వే చేస్తున్న అటవీ, రెవెన్యూ అధికారులు

పుంగనూరు, నవంబరు19(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పాళ్యంపల్లె రెవెన్యూ పరిధిలోని అటవీభూములను పలమనేరు ఆర్‌డీవో భవాని, ఎఫ్ఆర్వో శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించారు. ప్రభుత్వం మదనపల్లెకు చెందిన రామ్‌దాస్‌చౌదరికి పాళ్యంపల్లె ప్రాంతంలో క్వారీ మంజూరు చేసింది. అప్పట్లో అటవీశాఖ అధికారులు ఆ భూమి అటవీ ప్రాంతంలో ఉందని, రెవెన్యూ అధికారులు తమ పరిధిలోకి వస్తుందని పనులను నిలుపుదల చేశారు. దీంతో రామనాథ్‌చౌదరి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాలతో అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ సర్వే పనుల్లో తహసీల్దార్ రాము, పలమనేరు డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ శ్రీనివాస్‌నాయక్, వీఆర్వో అక్బర్, గార్డులు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో డంపింగ్‌యార్డుకు స్థలం ఎంపిక


చెత్తను తరలిస్తున్న ట్రాక్టరు

బైరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): బైరెడ్డిపల్లె పంచాయతీలో సేకరించిన చెత్తను వేయడానికి అవసరమైన స్థలాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఎంపికచేసిన ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు రెవిన్యూ సిబ్బందితో కలసి పరిశీలించారు. కొన్నేళ్లుగా మఠ్రిమానుచేను గ్రామానికి అనుకుని చెత్తను వేస్తుండడంతో పరిసరగ్రామాల ప్రజలు కాలుష్యంతో ఇబ్బందిపడేవారు. యార్డును గ్రామాలకు దూరంగా తరలించాలని మిట్టపల్లె, మఠ్రిమానుచేను గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అమర నాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రెవిన్యూ అధికారులతో మాట్లా డారు. ఆ మేరకు అధికారులు డంపింగ్ యార్డుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. మఠ్రిమానుచేనుకు దూరంగా స్థలాన్ని గుర్తించారు. దీంతో కిశోర్‌గౌడు సొంత నిధులతో ట్రాక్టర్ల ద్వారా చెత్తను నూతన డంపింగ్ యార్డుకు తరలించే పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి, కిశోర్‌గౌడుకు, అధి కారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు ఆవుల చోరీ

వి.కోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం పంచాయతీ మద్దిరాళ్ల గ్రామానికి చెందిన శంకరప్ప అనే రైతుకు చెందిన రెండు ఆవులను దొంగలు సోమవారం రాత్రి చోరీచేశారు. గ్రామానికి ఆనుకునే ఉన్న పశువుల కొట్టంలో రెండు జెర్సీ రకం ఆవులను కట్టేసి ఇంటికెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి ఆవులు కనిపించలేదు. రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆవుల విలువ రూ.లక్ష పైనే ఉంటుందని పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంఘమిత్రల అవకతవకలపై డీఎంజీల విచారణ


సభ్యులను విచారిస్తున్న కమ్యూనిటీ రిసోర్సు పర్సన్

రొంపిచెర్ల, నవంబరు19,(ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని సంఘమిత్రల అవకతవకలపై డీఎంజీ (డిస్ట్రిక్ ఫైనాన్షియల్ (గ్రూపు సభ్యులు) సీఆర్పీలు విచారణ చేపట్టారు. మండలంలో 27 మంది సంఘ మిత్రల పరిధిలో 175 గ్రూప్‌లు ఉన్నాయి. అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో కొందరిని తొలగించారు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. తొలగించిన వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. అయితే కొత్తవారికి పాతవారు రికార్డులు ఇవ్వకపోవడంతో వారంతా జిల్లా డ్వామా పీడీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు 14 మంది ఆడిట్ అధికారులు రొంపిచెర్లలోని ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనారాయణకాలనీ, నక్క బండ తదితర ప్రాంతాల్లోకి వెళ్లి గ్రూప్ సభ్యుల వద్ద విచారణ చేపట్టారు. విచారణలో వచ్చిన నివేదికలు జిల్లా అధికారులకు తెలియజేస్తామని డీపీజీలు భానుకుమార్, వాయిద్‌బాష తెలిపారు.

కల్యాణ మండపానికి విరాళం



సోమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మండప నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సోమలకు చెందిన చిన్నిన్నిగారి వెంకట్రామయ్య కుమారుడు గంగాధరం రూ.10, 516 విరాళంగా ఆలయ ధర్మకర్త సోమశేఖర్‌కు అందజేశారు. అలాగే గన్నా రంగయ్య కుమారుడు రామచంద్రయ్య రూ. 5,016, పీఎం భార్గవ్ 40 బస్తాల సిమెంట్ విరాళం అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు. లింగయ్య, చరణ్, శివశంకర్, రామసిద్ధులు పాల్గొన్నారు.

చర్మకారులకు రుణాలు ఇవ్వండి



రొంపిచెర్లనవంబరు19(ఆంధ్రజ్యోతి)తి: చర్మకారులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని చర్మకారుల సంఘ కార్యదర్శి సద్దల హరిప్రసాద్ ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని కోరారు. సద్దల హరిప్రసాద్ విజయవాడలో ఆమెను కలిసి చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మాదిగ నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు, చర్మకారులకు వృత్తి రుణాలు మంజూరు చేయాలని విన్నవించారు.

భూసార పరీక్షలతో అధికలాభాలు

రొంపిచెర్ల, నవంబరు19:(ఆంధ్రజ్యోతి) రైతులు తమ పొలాల్లో భూసారపరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు సాగుచేస్తే అధికలాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సుధారాణి అన్నారు. మంగళవారం మండలంలోని వారణాశివారిపల్లె, దద్దాలవారిపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పుదిపట్ల హైస్కూల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ స్నానంచేయాలని, భోజనం చేసేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, ఉతికిన దుస్తులు ధరించాలని సూచించారు. హెచ్‌ఎం పద్మజ పాల్గొన్నారు.

వైష్ణవీ దేవికి విశేష పూజలు

చౌడేపల్లె, నవంబరు19, (ఆంధ్ర జ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయం మొదటి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచా మృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సౌందర్యలహరి, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణి తీర్థప్రసాదాలు అందజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుంగనూరు రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పుస్తకాల పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి తులసీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో వ్యాచరచనలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

రామకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో అర్చకులు నాగరాజశర్మ మంగళవారం రాత్రి సంకటహర చతుర్థి పూజలు వైభవంగా జరిపించారు. సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వాములకు విశేష పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో
సర్పదోష నివారణ పూజలు

రామకుప్పం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు కృష్ణమూర్తి, హరినాథ్ భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. రాత్రి కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించారు.

అడవిపల్లె రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తిచేయండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే జగన్మోహన్



చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అడవిపల్లె రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 2014 - 2019 వరకు టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు.. అడవిపల్లె రిజర్వాయర్ పనులను 80శాతం పూర్తి చేశారన్నారు. 2019 -24లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను నిలిపివేసిందన్నారు. దీనివల్ల చిత్తూరు నగరపాలక సంస్థ రూ.120 కోట్ల వడ్డీ కడుతోందన్నారు. 20 శాతం పనులు పూర్తి కాకపోవడంతో నగరపాలక సంస్థ నిధులను కూడా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అమృత్ పథకం ద్వారా అడవిపల్లె రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తిచేస్తే గంగాధరనెల్లూరు, పూతలపట్టుకు కూడా తాగునీరు అందే అవకాశం ఉందని చెప్పారు. కాగా, పెండింగ్ పనులను పూర్తిచేస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు.

తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టండి : జడ్పీ సీఈవో



ఎస్ఆర్‌పురంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన రవికుమార్ నాయుడు

శ్రీరంగరాజపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, హౌస్ హోల్డ్ సర్వేలు పక్కాగా చేయాలన్నారు. ఎంపీడీవో మోహన, మండల విస్తరణాధికారి కోదండరామిరెడ్డి, డీసీసీబీ సీఈవో రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: ఎంపీడీవో కార్యాలయాన్ని కూడా మంగళవారం జడ్పీసీఈవో తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు, రోడ్ల నిర్మాణాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌డీవో రవికుమార్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలి / కలెక్టరేట్ వద్ద హమాలీల ధర్నా



చిత్తూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు పెంచిన కూలీరేట్లను వెంటనే అమలు చేయాలని సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద హమాలీ కార్మికులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. మూడు రూపాయలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరించారు. ప్రతినెలా ఐదో తేదీ జీతాలివ్వాల్సి ఉంటే ఇంతవరకు ఇవ్వక పోవడం సరికాదన్నారు. కార్మికులపై అధికారుల వేధింపులను మానుకోవాలన్నారు. అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రాన్ని ఇచ్చారు. రమాదేవి, రఘు, కృష్ణ, సుబ్రహ్మణ్యం, శంకర, సురేష్, బాష పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: జేడీ

తవణంపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జేడీ ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గోకులం షెడ్ల లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రెడ్డిబాబు, డీడీ ఆరీఫ్, ఏడీ పద్మావతి, ఏపీవో లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
I.P.No.19 of 2024

Between:
Mangapatnam Balakrishna ...Petitioner

And:
1) R.Lokambal,
2) K.Bhagyalakshmi. ...Respondents

NOTICES TO THE RESPONDENTS No.1 & 2

To:
1) **R.Lokambal,** W/o M.Kumar Raju, D.No.1-63, S.U.Puram Village, Krishnapuram Post, Renigunta Mandal, Tirupati District.
2) **K.Bhagyalakshmi,** W/o P.Govinda Reddy, Chinthareddipalli Village, Vinjam Post, Gangadhara Nellore Mandal, Chittoor District.

Madem, Please take notice that the above named petitioner filed the above Insolvency petition as against both of you to adjudge No.1 of you as an Insolvent by directing the Official Receiver to take charge of the petition schedule property to proper administration after getting annulment of alleged Regd. sale deed dated 01-07-2024 executed by the 1st respondent infavour of the 2nd respondent under the provisions of Insolvency Act and for sale of petition 'B' schedule property by the Official Receiver for the realization of the amount mentioned in petition 'A' schedule to the petitioner and the above I.P. is posted to **26-12-2024** for your appearance. Please be present in the said date at about **10.30 a.m.** either in person or through your advocate and to raise objections if any, failing which the matter will be decided exparte in your absence.

Sd/- **D.SATHISH KUMAR,**
Advocate for Petitioner
Place: Chittoor, Date: 19-11-2024

మాల కార్పొరేషన్ సభ్యుడిగా బాబు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యుడిగా బీజేపీకి చెందిన సి.బాబును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశ్రాంత టీచర్ అయిన బాబు ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

ముగిసిన ఎన్‌సీసీ క్యాంపు


చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 12వ తేదీన ప్రారంభమైన ఎన్‌సీసీ క్యాంపు మంగళవారంతో ముగిసింది. 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ మోనిస్ మాట్లాడుతూ.. క్యాడెట్లు దేశ భద్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏవో మేజర్ లోకనాథ్‌లు, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, వినోద్, మస్తాన్, బాలాజీ, యుగంధర్, కార్తీక్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

జాబ్ కనెక్ట్‌లో 13మంది ఎంపిక

చిత్తూరు సెంట్రల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక శిక్షణ జిల్లా సెంటర్‌లో ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్‌షిప్ అధికారి ఉద్యోగాలకు నిర్వహించిన సీడాప్ జాబ్ కనెక్ట్‌లో 13మంది ఎంపికైనట్లు డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ నాయుడు తెలిపారు. 20 ఖాళీలకు 60 మంది ఇంటర్వ్యూకు హాజరవగా, 13మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. సీడాప్ జేడీఎం సరిత, ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ స్టేట్ హెడ్ అనిల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. తలలు పగులుతాయేమో..!

ఎస్సీ బాలికల హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతోంది ● ఆందోళనలో విద్యార్థినులు



వేర్వేరు గదుల్లో స్లాబుకు పెచ్చులూడిపోయి కనిపిస్తున్న కమ్మీలు



గంగాధరనెల్లూరులోని హాస్టల్ భవనం

గంగాధరనెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులోని ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్ భవనంలోని స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థినులు, వార్డెన్ ఆందోళన చెందుతున్నారు. 40ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం బయట నుంచి చూస్తే అంతా బాగుందనిపిస్తుంది. లోపలంతా డొల్లే. ఈ భవనంలో విద్యార్థినులు నిద్రించే గదుల్లో స్లాబ్ పెచ్చులు ఊడిపడిపోవడం ఎక్కువైంది. వంటగదిలో సైతం అదే పరిస్థితి. నాలుగైదు గదుల్లో కమ్మీలు కనిపిస్తుండగా.. వర్షాలకు ఉరుస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏగదిలో సిమెంట్ పెచ్చులు ఊడిపడి తమ తలలు పగులుతాయోనని విద్యార్థినులు, వార్డెన్‌గా పనిచేస్తున్న రమాదేవి సైతం ఆందోళన చెందుతున్నారు. ఈ హాస్టల్ భవనంలో ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడ్డెరలను ఎస్టీలో చేర్చాలి

డీఆర్వోకు వినతి

చిత్తూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళం మురళి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు, ఇతర నేతలతో కలిసి డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50వేల మంది జనాభా కలిగి ఉన్నామని చెప్పారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నామన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి వీరమరణం పొందిన వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు హరిబాబు, శివకుమార్, మంజు, సతీష్, రమేష్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి: కలెక్టర్



బకాయిలపై కలెక్టర్‌కు విన్నవిస్తున్న చెరకు రైతులు

నిండ్ర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. అంతకుముందు రాజకీయ నాయకులతోనూ సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం, చెరకు రైతులకు బకాయిలు చెల్లించి, కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని కోరారు. తహసీల్దార్ శేషగిరిరావు, సీఐ భాస్కర్, ఏవో కృష్ణయ్య, నాయకులు వెంకటేశ్వరావు, రవినాయుడు, గాలి రమేష్ నాయుడు, రవికుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న జడ్జి విష్ణువర్మ

నగరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని నగరి మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి విష్ణువర్మ అన్నారు. నగరి కోర్టులో మంగళవారం పోలీసు, ఎక్సైజ్‌శాఖలు, బార్ అసోసియేషన్ మెంబర్లతో సమీక్షించారు. డిసెంబరు 14వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో శాఖలవారీగా ఎవరెవరు ఎన్ని కేసులు తీసుకొస్తారో ముందుగానే నిర్ణయించుకోవాలన్నారు. నగరి, నిండ్ర సీఐలు మహేశ్వర్, భాస్కర్, ఎక్సైజ్ ఎస్ఐ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి



గంగాధర నెల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరకనెల్లూరు పంచాయతీ అక్కదేవతల కండ్రిగకు చెందిన కర్ణాటక మాజీ విద్యాశాఖ మంత్రి స్వర్గీయ రఘుపతినాయుడు మనవడు అభిషేక్‌నాయుడు, నెల్లేపల్లె పంచాయతీ బొబ్బిగానిపల్లెకు చెందిన రాష్ట్ర బీజేపీ మాజీ కార్యవర్గ సభ్యుడు గుత్తా ప్రభాకర్‌నాయుడు మంగళవారం నారావారిపల్లెకెళ్లి రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీహీరో నారా రోహిత్‌ను పరామర్శించారు.

రుద్రయ్యకు పలువురి శుభాకాంక్షలు



పెనుమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దినేని కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బస్టాండులో భారీ కేక్ చేశారు. 500 మందికి అన్నదానంతోపాటు గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు వితరణ చేశారు. పార్లమెంటు కార్యదర్శి తలారి రెడ్డెప్ప, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, ఈశ్వర్‌ప్రసాద్, భాస్కర్, కృష్ణమూర్తినాయుడు, సురేష్‌నాయుడు, ఎస్ఎస్‌నాయుడు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారతపై చర్చ

పూతలపట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రంథాలయ కార్యాలయంలో మహిళా సాధికారతపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రంథాలయ అధికారి రవీంద్రబాబు, ఈవోఆర్డీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా: ఎంపీ

చిత్తూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబానికి భరోసా లభిస్తుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ మాత్రమేనని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మార్గదర్శకంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



ఆదిదంపతుల ఊరేగింపు

చిత్తూరు కల్చరల్, నవంబరు 19: కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామివారికి కార్తీక మాస రుద్రాభిషేకం, జ్వాలాతోరణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు శివకుమార్ గురుకుల్ బృందం.. 108 సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి, కాళభైరవట్రస్టు చైర్మన్ టి.వెంకటేషన్ కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

మాస మహిళా దినోత్సవం: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారి మాస మహిళా దినోత్సవం జరిగింది. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో మహిళలకు స్వామివారి ప్రసాదాలు, దుస్తులు వితరణ చేశారు.

సీఆర్ రాజన్‌కు సన్మానం



పూతలపట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంతో పలువురు నాయకులు మంగళవారం సన్మానించారు. టీడీపీ పూతలపట్టు కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, మధు, సుధాకర్ నాయుడు తదితరులున్నారు.

డీఏ సత్యప్రభకు నివాళి



అన్నదానం చేస్తున్న హేమలత

చిత్తూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం బలిజ సేవా సంఘం నేతలు నిర్వహించారు. సత్యప్రభ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మార్కెట్ యార్డులో అన్నదానం చేశారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, బలిజ సేవా సంఘం నేతలు పార్థసారధి నాయుడు, విశ్వనాథ్, ఆరణి తులసీరామ్, కోలా కిరణ్, చలపతి, ఆరణి బాలాజి, కందా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి మంగళవారం గుడిపాల మండలం పెరుమాళ్లకుప్పానికిచెందిన నాగిరెడ్డి రూ.1,00,000 విరాళంగా చెక్కురూపంలో అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

స్వామి సేవలో టీటీడీ బోర్డు సభ్యులు: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం టీటీడీ బోర్డు సభ్యులు మహేందర్‌రెడ్డి, రంగశ్రీ దర్శించుకున్నారు.

'క్యాన్సర్ స్క్రీనింగ్' తనిఖీ

చిత్తూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ప్రశాంత్‌నగర్‌లో జరుగుతున్న క్యాన్సర్, ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి మంగళవారం తనిఖీ చేశారు. చేశారు. సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ప్రశాంత్‌నగర్ యూపీహెచ్‌సీని పరిశీలించి, రోగులతో మాట్లాడారు. వైద్యాధికారికి సూచనలిచ్చి, రికార్డులు పరిశీలించారు.

26 మంది ఉద్యోగాలకు ఎంపిక

నగరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 49 మంది అభ్యర్థులు పాల్గొనగా 26మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ, కళాశాల జవహర్‌నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా ఈ జాబ్‌మేళా నిర్వహించారు. భాస్కర్‌రాజు, పంకజం, రసూల్, అఫ్రిన్, అరుణ్, జయకృష్ణ, రేవలి, లాల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

నగరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని వీకేఆర్‌పురం సచివాలయ పరిధిలో రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలో పుస్తక ప్రదర్శన



వెదురుకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ రకాల పుస్తకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద సహా అధ్యాపకులు హాజరయ్యారు.

పాచికలు ఆడిన 8మందిపై కేసు

చిత్తూరు అర్బన్, నవంబరు 19: డబ్బులు పెట్టి పాచికల ఆట(దాయాలు) ఆడిన ఎనిమిది మందిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని ఇందిరానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులను పందెంకాసి దాయాల ఆట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో వెళ్లి ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.37వేలను సీజ్ చేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా: భూమన



శ్రీరంగరాజపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని వైసీపీ శ్రేణులకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం 49. కొత్తపల్లెమిట్టలో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో నిర్వహించిన సర్వసభ సమావేశంలో ప్రసంగించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. డిప్యూటీ మాజీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు విజయానందరెడ్డి, కృపాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈవోకి ఆత్మీయ వీడ్కోలు

వెదురుకుప్పం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంమండలం గోపిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రంలో ఎంపీఈవోగా విధులు నిర్వహిస్తున్న కె.ప్రసన్నలక్ష్మి బదిలీపై అనంతపురంకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఏవో కార్యాలయంలో ఆమెకు ఏవో హేమలత, ఏఈవో హేమాద్రి, ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కాగా, అన్నూరు రైతుసేవా కేంద్రంలో పనిచేస్తున్న మునికృష్ణను గోపిశెట్టిపల్లెకు ఇన్‌చార్జిగా, గాజంకి కేంద్రం ఇన్‌చార్జి బాధ్యతలను ఏఈవో హేమాద్రికి అప్పగించినట్లు ఏవో తెలిపారు.